ఆ అన్నం అప్పన్న స్వరూపం

అప్పన్న ప్రసాదానికి 35 ఏళ్లు

1989 ఆగస్టు 14న ప్రారంభమైన పథకం • రూ.35.55 కోట్లకు చేరువైన విరాళాలు



అన్నప్రసాదాన్ని తయారుచేస్తున్న సిబ్బంది

సింహాచలం: నమో నారసింహా అంటూ అప్పన్న దర్శనం కోసం నిత్యం వేలాది మంది భక్తులు సింహాచలం పుణ్యక్షేత్రానికి తరలివస్తుంటారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల ఆకలిని తీరుస్తోంది నిత్య అన్నప్రసాద వితరణ కేంద్రం. నిత్యం వేలాదిమంది భక్తుల ఆకలి తీర్చే..సింహాచలం నిత్యాన్నదాన పథకం బుధవారంతో 35 ఏళ్ల పూర్తి చేసుకుని 36వ ఏటలోకి అడుగుపెడుతోంది. అప్పన్న దర్శనం ఎంత భాగ్యమో..అన్నదాన సత్రంలో భోజనం చేయడం అంతే భాగ్యంగా భావిస్తుంటారు భక్తులు. స్వామివారి దర్శనం పూర్తికాగానే బయటికు వస్తూనే అన్నదాన సత్రంలో భోజనం చేస్తుంటారు. ఆకలే అర్హతగా భక్తులకు ఎల్లవేళలా కడుపునిండా భోజనం వడ్డిస్తూ అందరి మన్ననలు పొందుతోంది అన్నప్రసాద వితరణ కేంద్రం. ఇక్కడ అందించే భోజనాన్ని సింహాద్రి అప్పన్న దివ్య ప్రసాదంగా భావిస్తారు భక్తులు.

ఒడిశా, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా సింహాచలం తరలివస్తుంటారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాన్ని అందించాలన్న ఉద్దేశంతో దేవస్థానంలో 1989 సంవత్సరం ఆగస్టు 14న నిత్యాన్నదాన పథకానికి శ్రీకారం చుట్టారు. దేవస్థానంలో పనిచేసే ఉద్యోగులే ఈ పథకానికి రూ.50వేలు తొలి విరాళం అందించి ఆద్యులయ్యారు. అప్పటి నుంచి ఈపథకానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తోంది. వారి ప్రోత్సాహంతో దినదినాభివృద్ధి చెందుతూ నేటికి రూ.35.55 కోట్ల డిపాజిట్లు చేరుకున్నాయి. దాతలు అందించే విరాళాలను బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ వేసి వాటిపై వచ్చే వడ్డీతో భక్తులకు నిత్యం దేవస్థానం అన్నప్రసాదం అందిస్తోంది.

దాతలకు గుర్తింపు

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష నుంచి ఆపైన విరాళం అందించే దాతలను మహా రాజపోషకులుగా, రూ.50వేలు నుంచి ఆ పైన విరాళం అందించే దాతలను రాజపోషకులగా, రూ.10,116 నుంచి ఆ పైన విరాళాలు అందించే దాతలను పోషకులుగా, రూ.10,116 విరాళాలు అందించేవారిని దాతలుగా దేవస్థానం గుర్తింపునిస్తుంది. ఇప్పటి వరకు రూ.5లక్షలకు పైగా విరాళాలు అందించినవారు 11 మంది, రూ.లక్ష పైగా విరాళాలు ఇచ్చినవారు 468మంది, పదివేలకి పైగా విరాళాలు అందించిన వారు 1,031మంది ఉన్నారు.

బయోమెట్రిక్‌తో భక్తుల సంఖ్య లెక్కింపు

అన్నప్రసాదం స్వీకరించేందుకు ప్రతీ రోజూ ఎంత మంది భక్తులు వస్తున్నారో తెలుసుకునేందుకు అన్నదాన భవనంలోకి ప్రవేశించే మార్గంలో బయోమెట్రిక్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. భక్తుల నుంచి వేలి ముద్ర తీసుకుంటారు. తద్వారా రోజుకు ఎంతమంది వచ్చారో లెక్కకడతారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే అన్నప్రసాదాన్ని అందించే ప్రక్రియ మధ్యాహ్నం 3వరకు కూడా కొనసాగుతుంది.

అన్నదానం ఇలా..

సోమవారం నుంచి శుక్రవారం వరకు	:	3500 మందికి
శనివారం	:	7500 మందికి
ఆదివారం	:	5000 మందికి
ప్రతి రోజూ రాత్రి	:	500 మంది వరకు

- రోజుకి ఒక్కో భక్తుడికి వెచ్చించే అన్నప్రసాదం ఖర్చు – రూ.32
- 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఫిక్స్‌డ్ డిపాజిట్లు– రూ.2.35కోట్లు
- 2023–24 నాటికి మొత్తం ఎఫ్‌డీలపై వచ్చిన వడ్డీ – రూ.1.96కోట్లు
- 2023–24లో రూ.10,116లోపు వచ్చిన విరాళాలు – రూ.1.63కోట్లు
- 2023–24 ఆర్థిక సంవత్సరంలో భోజనం చేసిన వారి సంఖ్య – 14,23,159 మంది
- 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 5లక్షలకి పైబడి...



అన్నప్రసాద భవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు



అన్నప్రసాద భవనం వద్ద విరాళాల స్వీకరణ కేంద్రం



అన్నప్రసాద భవనంలో భక్తుల నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న సిబ్బంది

రుచి బాగుంటుంది



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి సింహగిరికి వచ్చినప్పుడల్లా అన్నప్రసాదాన్ని స్వీకరిస్తా. అన్నప్రసాదం ఎంతో రుచికరంగా ఉంటుంది. ముఖ్యంగా ఇక్కడ చేసే సాంబారు రుచే వేరు. మరెక్కడా ఆరుచి రాదని అనిపిస్తుంటుంది. –లక్ష్మి, శ్రీకాకుళం

మహా ప్రసాదంగా భావిస్తా..



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి నిత్యం వస్తుంటా. అన్నదాన భవనంలో భోజనం చేస్తా. మహాప్రసాదంగా అన్నప్రసాదాన్ని భావిస్తాను. దాతల సహకారంతో సింహాచలం దేవస్థానం చేస్తున్న అన్నదానం ఎంతో గొప్ప కార్యక్రమం. –దినేష్, విజయనగరం

దాతల నుంచి విశేష స్పందన



అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. సింహాచలం దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి 35 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ పథకానికి దాతల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. భక్తులకు రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నాం. ప్రస్తుతం అన్న ప్రసాదం అందిస్తున్న భవనంలోని పై అంతస్తులోనే స్వామివారి ప్రసాదాల తయారీశాల కూడా ఉంది. ప్రస్తుతం స్వామివారి ప్రసాదాల తయారీకి ప్రత్యేకంగా భవనం నిర్మించి, ఇప్పుడున్న రెండు అంతస్తుల్లోనూ ఒకేసారి సుమారు 600మందికి వరకు అన్నప్రసాదాన్ని అందించే విధంగా ప్రణాళిక చేస్తున్నాం.

–ఎస్.శ్రీనివాసమూర్తి, ఈవో, సింహాచలం దేవస్థానం

ఆ నేతలు ఏమయ్యారు?

• టీడీపీ నాయకులపై గిరిజనుల ఆగ్రహం



శ్రీకృష్ణాపురం వద్ద రైల్వే స్థలానికి దారి కోసం చదును చేసిన స్థలం



స్థలాన్ని చదును చేయవద్దంటూ సోమవారం జేసీబీకి అడ్డంగా నిలిచిన గిరిజన మహిళలు

అరిలోవ: నగరంలోని శ్రీకృష్ణాపురంలో రైల్వే స్థలంలో జీవీఎంసీ వివిధ అభివృద్ధి పనుల కోసం వినియోగించుకుంది. దీనికి ప్రత్యామ్నాయంగా రైల్వే శాఖకు ముడసర్లోవలో సుమారు 55 ఎకరాలను 15 ఏళ్ల క్రితం కేటాయించింది. ఈ స్థలంపై కృష్ణాపురం గిరిజనులకు...అధికారులకు మధ్య నాటి నుంచి పంచాయితీ నడుస్తోంది. వ్యవసాయం చేసుకోవడానికి ఆ స్థలాన్ని కేంద్ర ప్రభుత్వం తమ పూర్వీకులకు కేటాయించిందని శ్రీకృష్ణాపురం గిరిజనులు కొన్నాళ్లుగా జీవీఎంసీ అధికారులు, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ఆ స్థలంలో రైల్వే అధికారులు అడుగుపెట్టినప్పుడల్లా కృష్ణాపురం గిరిజనులు అడ్డుతగులుతూనే ఉన్నారు. గత డిసెంబరులో అక్కడ స్థలం చుట్టూ కంచె వేయడానికి జీవీఎంసీ అధికారులు ప్రయత్నించగా గిరిజనులు అడ్డుకొన్నారు. అప్పట్లో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాలతో స్థానిక టీడీపీ నాయకులు గిరిజనులకు అండగా నిలిచారు. కంచె వేయడానికి వీలులేదంటూ గిరిజనుల తరఫున మేమున్నామంటూ తెగ హడావుడి చేశారు. కొందరు పోలీసులు మీద తిరబడ్డారు. కట్ చేస్తే ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కింది. టీడీపీ నేతల స్వరం మారింది. గిరిజనులు ఎలా పోతే మాకేంటి అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఆ స్థలంపై రైల్వే అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ముడసర్లోవ రిజర్వాయరు వెనుక ఉన్న స్థలానికి బీఆర్‌టీఎస్ నుంచి నేరుగా రహదారి కావాలని జీవీఎంసీ అధికారులను రైల్వే అధికారులు కోరారు. దీంతో సోమవారం జీవీఎంసీ జోన్–2 అధికారులు బీఆర్‌టీఎస్‌ను ఆనుకొని విశాఖ కేంద్ర కారాగారం ఎదురుగా జేసీబీతో స్థలం చదును చేయించే పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న శ్రీకృష్ణాపురం గిరిజనులు పనులను అడ్డుకొన్నారు. మా స్థలాన్ని రైల్వేకు కేటాయించవద్దంటూ గిరిజన మహిళలు, యువకులు అధికారులతో వాగ్వాదం చేశారు. అయినా అధికారులు మాత్రం వారిపని వారు చేసుకుపోయారు. ఇదిలా ఉండగా ఈసారి మాత్రం అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు ఎవ్వరూ ముందుకురాలేదు. గంటలు తరబడి ఈ తతంగం జరిగినా ఎమ్మెల్యేగాని, స్థానిక టీడీపీ నాయకులుగాని ఒక్కరూ స్పందించలేదు. దీంతో టీడీపీ నేతల తీరుపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు కోసమే గత ఏడాది మాకు సహకరించారని, ఆ తర్వాత ముఖం చాటేశారని ఆరోపించారు. ఈ స్థలంలో విషయంలో అండగా ఉంటామని హామీ ఇచ్చిన టీడీపీ నేతలు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

షాపింగ్ కాంప్లెక్స్ శుభ్రం

సాక్షి ఎఫెక్ట్..



మద్యం బాటిళ్లు తొలగించిన అనంతరం షాపింగ్ కాంప్లెక్స్

అరిలోవ: ఆరిలోవ కాలనీలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను జీవీఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది శుభ్రం చేశారు. ఇక్కడ నిర్మించిన 42 షాపులను ఎవరికీ కేటాయించకపోవడంతో ఆరేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ఈ షాపింగ్ కాంప్లెక్స్ మందుబాబులకు అడ్డాగా మారింది. వారు తాగి పడేసిన ఖాళీ మద్యం బాటిళ్లు ఇక్కడ కుప్పలుగా పేరుకుపోయాయి. ఇటీవల వాటిని కొందరు మూటలుగా కట్టి విక్రయించడానికి సిద్ధం చేశారు. దీనిపై 'కుప్పలుగా ఖాళీ మద్యం బాటిళ్లు'అనే శీర్షికతో ఈ నెల 11న 'సాక్షి'లో కథనం ప్రచురించింది. ఈ కథనానికి జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించారు. ఖాళీ మద్యం బాటిళ్లను మంగళవారం సిబ్బందితో తొలగించి షాపులన్నింటినీ శుభ్రం చేయించారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లోనికి మందుబాబులు రాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

ఎంవీపీకాలనీ: స్వాతంత్ర్య ఉద్యమంలో అమరుల త్యాగాలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. బీజేపీ తూర్పు కన్వీనర్ మురళీమోహన్‌రావు ఆధ్వర్యంలో స్వచ్ఛ్‌భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీచ్‌రోడ్డులోని మన్యం దొర అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పార్టీ శ్రేణులంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో అసువులుబాసిన స్వాతంత్ర్య సమరయోధులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథ్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బొత్సను కలిసిన అరకు ఎంపీ



బొత్సతో అరకు ఎంపీ తనుజ రాణి

బీచ్‌రోడ్డు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్న బొత్స సత్యనారాయణను అరకు ఎంపీ జి.తనూజ రాణి కలిశారు. మంగళవారం సిరిపురంలోని బొత్స నివాసంలో ఆమె మార్యదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుంభా రవి బాబు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, అల్లూరి సీతరామరాజు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

బీచ్‌రోడ్డు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హోలీ వే సంస్థ చైర్మన్ సత్యానంద్ కుమార్ తెలిపారు. ఎంవీపీ కాలనీలోని హోలి వే టవర్స్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రపంచ మేటి దర్శకుడు హిచ్‌కాక్

సీతంపేట : ప్రపంచ మేటి సినీ దర్శకుడు ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి వేడుకలు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా హిచ్‌కాక్ చిత్రపటానికి నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు, ఎస్.కె.మిశ్రో పూలదండలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అంతగా లేని రోజుల్లో మంచి సినిమాలు అందించారని, అందుకే ఆయన మాస్టర్ ఆఫ్ సస్పెన్స్‌గా పేరుగాంచారన్నారు. ప్రపంచ సినిమాకు హిచ్‌కాక్ చేసిన సేవలు మరవలేనివని, ఆయన గొప్పతనం నేటి యువ దర్శకులకు తెలియజేయాలనే ఉద్దేశంతో జయంతి వేడుక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావు, ఎం.వి.వి. గుప్త, అరుణ పాల్గొన్నారు.

15న మహా సంప్రోక్షణ

సీతంపేట : లలితానగర్‌లో గల శ్రీలలితా పీఠంలో ఈ నెల 14, 15న భూ నీలా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల మహా సంప్రోక్షణ నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు మంగళవారం పీఠంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15న ఉత్సవ మూర్తుల మహా సంప్రోక్షణ ఏకాహ్నిక దీక్షగా జరుగుతుందని తెలిపారు.

సీనియర్ సిటిజన్స్‌కు అకడమిక్, సాంస్కృతిక పోటీలు



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: నగరంలోని సీనియర్ సిటిజన్స్ కోసం సెప్టెంబర్ 10వ తేదీన ప్రత్యేక అకడమిక్, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు సంబంధించిన గోడపత్రికను రాణి చంద్రమణి హాస్పటల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఏ డే ఆఫ్ గ్రేట్, మీట్ అండ్ ట్రీట్ ఫర్ సీనియర్ సిటిజన్స్ పేరిట సెప్టెంబర్ 10న నగరంలోని అల్లూరి విజ్ఞానకేంద్రంలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కన్వీనర్ కె.రమాప్రభ తెలిపారు. అకడమిక్ పోటీల్లో భాగంగా పెయింటింగ్, పద్యాలాపన, క్విజ్, మెమురీ టెస్ట్, స్టోరీ రైటింగ్, కవితలు, కథలు, వార్తా ప్రతిక పఠనం, ఇంటర్‌నెట్ శోధన, ఉపన్యాసం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు జరుగుతాయన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శాస్త్రీయ నృత్యం, మిమిక్రీ, స్టాండప్ కామిడీ, గానం, మోనో యాక్షన్, దేశభక్తి గీతాలాపన, పౌరాణిక పద్యాలు, వాయిద్య సంగీతం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల సీనియర్ సిటిజన్స్ ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మంగపతి, కార్యదర్శి జోస్‌తో పాటు పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా వేడుక

మద్దిలపాలెం: డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం హర్ ఘర్ తిరంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ జాతీయ పతాకాన్ని ఇంటిపై ఎగురవేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఐ.విజయబాబు సూచించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఈ కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారులు పి.ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, శామ్యూల్ డేవిడ్‌రాజ్, .బి.లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా


ఉత్సాహంగా బాలల పోటీలు



బహుమతులు అందుకున్న విజేతలతో మధుసూదన్, తదితరులు

బీచ్‌రోడ్డు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థిత ప్రజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలు ఉత్సాహంగా సాగాయి. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో మంగళవారం బీచ్‌రోడ్డులోని పాండురంగాపురం పార్క్ కన్వెన్షన్ హాల్‌లో పోటీలను నిర్వహించారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పబ్లిక్ స్పీచ్, వ్యాస రచన పోటీలు, క్విజ్, డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్, పాటలు, ఫ్యాన్సీ డ్రెస్సు పోటీల్లో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఆదాయపు పన్నులశాఖ డిప్యూటీ కమిషనర్ మధుసూదన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థిత ప్రజ్ఞ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వైవీవీ సత్యనారాయణ, సూర్యరావు, చిరంజీవి రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మంగళవారం డ్రైడే పాటించాలి



నీటి నిల్వలను తొలగిస్తున్న జిల్లా మలేరియా విభాగ సిబ్బంది

మద్దిలపాలెం: ప్రతి మంగళవారం డ్రైడే పాటించాలని, ఆరోజు ఇంటి పరిసరాలలో నీటి నిల్వలను తొలగించాలని జిల్లా మలేరియా విభాగం సిబ్బంది బి.కుమార్, పి.గణేష్‌లు సూచించారు. పిఠాపురంకాలనీలో మంగళవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వారి ఇంటి పరిసరాలలో నీటి నిల్వలకు గుర్తించారు. ఇంట్లో ఫ్రిడ్జ్‌లు, ఏసీల ద్వారా వచ్చే నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. వారంరోజులు నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యకార్యకర్త రాము నాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల ప్రతిజ్ఞ



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రేసవానిపాలెంలో ఉన్న వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉద్యోగుల చేత డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు. దేశాభివృద్ధి, పురోగతికి ప్రతి ఒక్కరూ అంకితం కావాలని ఈ సందర్భంగా ఉద్యోగులంతా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను గౌరవించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సన్యాసి దొరకు గిరిజన సంఘం ఘననివాళి



సన్యాసి దొర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు

ఎంవీపీకాలనీ: గిరిజన నాయకుడు ఆర్ఎస్ దొర వర్థంతిని పురస్కరించుకొని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్ వేదికగా మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. తొలుత సంఘం నాయకులు దొర చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి ఆర్ఎస్ దొర అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.సత్యనారాయణ పాల్గొన్నారు.